'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# నిను వీడని పీడను నేనే!

*గోడ మీద క్యాలెండర్లు మారుతున్నాయి. కానీ 'నిను వీడని పీడను నేనే' అంటూ కరోనా మనతో దోబూచులాడుతూనే ఉన్నది. కొత్త కొత్త అవతారాలెత్తుతూ వెంటాడుతూనే ఉన్నది. వైరస్ కరాళ నృత్యానికి ఇంకా తెరపడలేదనేది కఠోర వాస్తవం. 2019 డిసెంబర్‌లో చైనాలోని వూహాన్‌లో ఇన్‌ఫ్లూయంజా వ్యాపించింది. ఆ నగరంలోనే వైరస్ పరిశోధన కేంద్రం ఉండటంతో చైనా కావాలని విడుదల చేసిందనో, పొరపాటున బయటకు పాకిందనో.. ఇలా ఏవేవో కుట్ర సిద్ధాంతాలు అప్పట్లో ప్రచారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. 'కరోనా వైరస్ డిసీజ్ 2019'కు హ్రస్వరూపమే కొవిడ్-19. సార్స్ కొవ్-2 వైరస్ దీనికి కారణం. 2020 మార్చి 11న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) దీనిని మహమ్మారిగా ప్రకటించింది.*

*ఆ సంగతి అలా ఉంచితే ఇప్పుడు మనం 2023 డిసెంబర్‌లో ఉన్నాం. మూడునాలుగు రోజుల్లో 2024లోకి అడుగుపెట్టబోతున్నాం. కరోనా మాత్రం మన నెత్తి మీద వేలాడుతూనే ఉన్నది. ఎన్నెన్ని దేశాలకు పాకింది కరోనా.. ఎన్నెన్ని ప్రాణాలను బలిగొన్నది? డెల్టా, ఒమిక్రాన్.. ఇలా వేరియంట్ల పేర్లు మారుతున్నాయి. కానీ, కథ ఒకటే. ఈ కథ కంచికి ఎప్పుడు చేరుతుందో తెలియదు. ఇదొక భయానక ధారావాహికలా సాగుతూనే ఉన్నది. మధ్యమధ్యలో ధార తెగుతున్నది. కొంతకాలం విరామం. ఊపిరి పీల్చుకునేలోపే విజృంభణ. కరోనా మళ్లీమళ్లీ రంగులు మారుతూ మన ముందుకు వస్తూనే ఉన్నది. తాజాగా జేఎన్-1 ఎపిసోడ్ నడుస్తున్నది. అప్పుడెప్పుడో వందేండ్ల క్రితం 1918-1920 మధ్యకాలంలో 'స్పానిష్ ఫ్లూ' అనే మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడించింది. అప్పటికి ఇప్పుడున్నన్ని ప్రయాణ సాధనాలు లేవు. ఆధునిక చికిత్సలూ అందుబాటులోకి రాలేదు. రవాణా మార్గాలు, వ్యాపార, వాణిజ్య సంబంధాలు విస్తరించిన కొన్నిదేశాలకే పరిమితమైంది. 1.7 కోట్ల నుంచి 10 కోట్ల మంది వరకు దీనికి బలయ్యారు. ఆ తర్వాత వైరస్ చల్లబడటంతో కథ ముగిసింది. కానీ కరోనా అంతకంటే తీవ్రంగా విరుచుకుపడింది. దాదాపు భూమ్మీద ఉన్న అన్ని దేశాలకూ పాకింది. డబ్ల్యూహెచ్‌వో లెక్కల ప్రకారం ఇప్పటివరకు సుమారు 77 కోట్ల మంది కరోనా బారిన పడితే, అందులో సుమారు 70 లక్షల మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవలి దశాబ్దాల్లో జడిపించిన మహమ్మారులు బర్డ్ ఫ్లూ', స్వైన్ ఫ్లూ' వంటివి కరోనాకు అక్కాచెల్లెళ్ల వంటివే. స్థాయిలో మాత్రం దరిదాపుల్లోకి రావు. అప్పుడప్పుడు కొత్తవైరస్‌లు పుట్టుకురావడం, కొన్నేండ్లు మానవాళిని పీడించి తెరమరుగు కావడం చరిత్రలో జరిగేదే.*

*తాజాగా గత వారం రోజుల్లో దేశంలోని పలురాష్ర్టాల్లో కరోనా కేసులు క్రమంగా పెరుగుతూ నాలుగువేలు దాటాయి. స్వల్ప సంఖ్యలోనే అయినా మరణాలు సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. కరోనా టీకా పరిశోధనలో, తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిన మన హైదరాబాద్ మహానగరంలోనూ కొత్త కేసులు నమోదవుతున్నాయి. వీటిలో అత్యధికం ఒమిక్రాన్ రకాలే. అయితే ప్రస్తుతం వ్యాపిస్తున్న జేఎన్-1 వైరస్‌కు కొత్త టీకా అవసరం లేదని, ఇదివరకు టీకా తీసుకున్న వారు మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. పైగా ఇది అంతగా ప్రాణాంతకం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. ఇది కొంత ఊరట కలిగించే విషయం. అయినా అలసత్వం ఏమాత్రం పనికిరాదు. నిన్నటిదాకా జరిగిన ఘోరకలిని మరచిపోకూడదు.*

# అటు పొగలు.. ఇటు సెగలు

**దేశ ప్రజలు నూతన సంవత్సరంలోకి ఒకరకమైన నిర్వేదం, నిరుత్సాహంతో అడుగుపెడుతున్నారని అనిపిస్తున్నది. అందుకు కారణం ఏమంటే.. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో జరిగిన సంఘటనలు. అదొక్కటే కారణం కాదనుకోండి. కానీ అదొక బలమైన కారణం అనటంలో సందేహం లేదు.**

**తాజాగా ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మన దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చేదు అనుభవాలు మిగిల్చేవిగా ఉండిపోతాయి. ఎందుకంటే పార్లమెంట్‌పై ఒకే సమావేశంలో రెండు దాడులు జరిగాయి. మొదటిది ఆగంతకులు చేసిన దాడి కాగా, రెండోది ప్రతిపక్షాలపై పాలకపక్షం చేసిన దాడి. రెండు దాడులూ హేయమైనవే.**



**గుమ్మడిదల రంగారావు**





పార్లమెంట్‌పై ఆగంతకుల దాడి చాలా గర్హనీయమైనది. దాడి చేసిన వ్యక్తులు ఆకతాయిలనే ప్రస్తుతానికి మనకున్న సమాచారం. అంటే వాళ్లు ఉగ్రవాద సంస్థలకు చెందినవారని దర్యాప్తు సంస్థలు ఇప్పటివరకు నిర్ధారించలేదు. కానీ వాళ్ల దుస్సాహసాన్ని ఖండించాలి. చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలి. దాడికి పాల్పడినవారు నిరుద్యోగులు, నిస్పృహకు లోనైనవారు అనే సాకుతో వాళ్లు చేసిన పనిని తేలికగా చూడకూడదు. వాళ్ల ఆకతాయి చేష్టలకు ఏకంగా పార్లమెంటును వేదికగా చేసుకోవటం చూసి సామాన్యులు విస్తుపోయారు.

పార్లమెంట్‌పై దాడికి తెగించిన ఆ దుండగులు శిక్షార్హులు అనటంలో ఎటువంటి సందేహం లేదు. పార్లమెంట్ రక్షణ వ్యవస్థ కన్నుగప్పి రంగు పొగల గొట్టాలను లోపలికి తీసుకెళ్లడం చిన్న విషయం కాదు. ఆ పొగే కనుక విషపూరితమైనదైతే దాని పరిణామాలు ఊహించటానికే భయంకరంగా ఉండేవి. ప్రాణ నష్టం ఏమీ జరగలేదు కదా అని ఉపేక్షించాల్సిన అవసరం లేదు. పార్లమెంటుపై దాడి చేయాలనే ఆలోచనే దుర్మార్గమైనది. పార్లమెంట్‌లోకి ప్రవేశించే సందర్శకులకు నఖశిఖ పర్యంతం తనిఖీలుంటాయి. భద్రతా సిబ్బంది సందర్శకుల బూట్లలో ఉన్న వస్తువులను పసిగట్టలేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సరే అది మానవ తప్పిదమో? లేదా సాంకేతికపరమైన లోపమో? దర్యాప్తులోనే తేలాలి.

పరిశీలకులు, పండితులు, పామరులకు కూడా విస్మయం కలిగించే విషయం ఏమంటే.. అసలు సందర్శకుల పాస్ కోసం సిఫారసు చేసిన ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం. తన ద్వారా వచ్చిన సందర్శకుల ప్రవర్తనకు సంబంధించి సిఫారసు చేసిన ఎంపీకి బాధ్యత ఉండదా? కానీ, సదరు ఎంపీపై ఎలాంటి చర్యలూ లేవు. అదే సదరు సభ్యుడు ఏ విపక్ష పార్టీకో చెందినవాడైతేనో లేక మైనారిటీ సభ్యుడైతేనో పరిణామాలు తీవ్రంగా ఉండేవి. దేశభక్తికి సంబంధించిన ఆరోపణలు, ప్రత్యారోపణలతో పార్లమెంట్ ప్రాంగణంతో పాటు కాషాయ మీడియాలో హోరెత్తిపోయేది. సదరు ఎంపీ అధికార పక్షానికి చెందినందున కాషాయ బ్రిగేడ్ నోరెత్తడం లేదు. ఇటీవల దేశం తెలుసుకున్న నగ్నసత్యం ఏమంటే దేశభక్తి అనేది బీజేపీ సొత్తు అని!

**పాస్ కోసం నిర్దేశించిన దరఖాస్తులో సందర్శకుడి నడవడికకు పూర్తి బాధ్యత తనదేనని సిఫారసు చేసేవారు చెప్పాల్సి ఉంటుంది. పార్లమెంట్ సమావేశాలు చూడటానికి సందర్శకులకు పాసులు ఎంపీల ద్వారానే కాదు, పార్లమెంట్‌లో పనిచేసే ఉన్నత స్థాయి అధికారుల ద్వారా కూడా పొందవచ్చు. అధికారులు కూడా తాము సిఫారసు చేసే సందర్శకుల నడవడికకు పూర్తి బాధ్యత వహిస్తామని చెప్పాలి.**

సందర్శకుడు నిబంధనలకు భిన్నంగా ప్రవర్తిస్తే సిఫారసు చేసిన అధికారి చిక్కుల్లో పడతారు. అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. మరి ఎంపీలకెందుకు ఈ మినహాయింపు? దుండగులకు పాస్ కోసం సిఫార్సు చేసిన ఎంపీని కనీసం సమావేశాల నుంచి సస్పెండ్ చేయాల్సింది. అలా కాకుండా, ఈ సంఘటనపై హోం మంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు ఉభయ సభల నుంచి ఏకంగా 146 మంది సభ్యులను సస్పెండ్ చేయడం దిగ్భ్రాంతి కలిగించే విషయం. దీన్నే పార్లమెంట్‌పై రెండో దాడిగా పరిగణించాలి. ఇది పార్లమెంట్‌పై ఆగంతకులు చేసిన దాడికన్నా తక్కువేమీ కాదు. ప్రశ్నించడం అనేది ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం. ఈ ఆయుధంతోనే ప్రభుత్వాన్ని సభ్యులు నిలదీస్తారు. అందుకే ప్రశ్నకాలం అనేది చాలా ప్రతిష్ఠతో కూడుకున్న పార్లమెంటరీ ప్రక్రియ. మెజారిటీని అడ్డం పెట్టుకుని ప్రశ్నించేవారిని సస్పెండ్ చేయడం పార్లమెంట్ గొంతు నొక్కటమే అవుతుంది!

తీవ్రమైన సంఘటన జరిగినప్పుడు ప్రభుత్వం బాధ్యత వహించి ప్రకటన చేయాలని అడగటం సభ్యుల హక్కు. అది వారి బాధ్యత కూడా. ప్రకటన చేయాలని అడిగినందుకు 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయటం ఇదే తొలిసారి. ఇదొక దురదృష్టకర స్పందన. పార్లమెంట్‌లో ప్రకటన చేసేటంతటి సమాచారం ప్రభుత్వం వద్ద లేకపోవచ్చు. ఎందుకంటే దర్యాప్తు ఇంకా ఓ కొలిక్కి రాలేదు గనుక. ప్రభుత్వం వద్ద ఉన్న ప్రాథమిక సమాచారంతోనే సభలో ప్రభుత్వం స్పందన తెలియజేయాలి కదా! ఇదేమైనా సాధారణ విషయమా? ప్రాణహాని జరగలేదు నిజమే. అందుకని ఈ దాడి తీవ్రతను తక్కువ చేసి చూడకూడదు కదా! ఇటువంటి సందర్భాల్లో ప్రభుత్వం గానీ, విపక్షాలు గానీ రాజకీయం చేయటం తగదు. ఇరుపక్షాల మధ్య మాట్లాడుకునే వాతావరణం ఉండాలి. పాలక పక్షం, ప్రతిపక్షం రాజకీయ ప్రత్యర్థులే గానీ, విరోధులు కాదు. మరి ఎందుకు ఈ పంతం, పట్టుదల? ఎవరికి ఉపయోగపడుతుంది.. ఇటువంటి మొండి వైఖరి?

ప్రజా ప్రతినిధులకు సభలో ఉండే బాధ్యతలకు నాలుగు కోణాలుంటాయని గతంలో చర్చించుకున్నాం. మొదటగా సభ్యులు మనస్సాక్షి ప్రకారం నడుచుకోవాలి. నేతలకు మంచీచెడు అనే విచక్షణ బాగా ప్రస్ఫుటంగా ఉండాలి. దాని ప్రకారం నడుచుకోవాలి. రెండోది వారిని ఎన్నుకున్న ప్రజల అభిప్రాయం ప్రతిబింబించేలా నడుచుకోవాలి. సభలో గందరగోళం సృష్టించాలని ప్రజలు ఎప్పుడూ చెప్పరు. మూడోది పార్టీ కోణం. ఇదే అన్నిటికన్నా పదునైన, ప్రమాదకరమైన కోణం. నాలుగోది రాజ్యాంగం. సభలో సభ్యులుగా రాజ్యాంగంపైనే ప్రమాణం చేస్తారు.

**రాజ్యాంగాన్ని కాపాడతామని, రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తామని, శాసనాన్ని గౌరవిస్తామని. మన రాజ్యాంగం దేశం నలుమూలలను కలిపి, ప్రజల మధ్య భూ సమగ్రతను, ఐకమత్యాన్ని, జాతీయతా భావాన్ని పెంపొందించే ఒక ఆదర్శవంతమైన దిక్సూచి. దాన్ని గౌరవించాలి. స్వాతంత్ర్య సమరయోధులు, జాతి నిర్మాణ ప్రదాతలు ఎంతో లోతైన ఆలోచనతో రూపకల్పన చేసిన ఒక పవిత్ర ఒడంబడిక మన రాజ్యాంగం.**

ప్రజలు అభివృద్ధి పథంలో పయనించటానికి తగిన దిశానిర్దేశం చేసే గ్రంథం మన రాజ్యాంగం. ప్రజలందరూ ఒకటేనని చాటిచెప్పిన ధర్మబోధిని మన రాజ్యాంగం. రాజ్యాంగ ధర్మాన్ని గాలికొదిలేసి, ప్రజల ఆకాంక్షలను పెడచెవిన పెట్టి, మనస్సాక్షిని ఇంట్లో విడిచిపెట్టి, కేవలం పార్టీ ఆడమన్నట్టు ఆడటం మన నేతలకు పరిపాటిగా మారింది. ఎన్నుకున్న ప్రజల ఆశలు, ఆకాంక్షలు గట్టిగా వినిపించి ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయాల్సిన చట్టసభలు నేడు రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోవటం దురదృష్టకరం.

2012లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ బొగ్గు గనుల వివాదంపై పార్లమెంట్ సమావేశాలను పూర్తిగా స్తంభింపజేసింది. ఉభయసభల్లో ఒక్క రోజు కూడా సమావేశాలు జరగకపోవటం చాలామందికి గుర్తుండే ఉంటుంది. సభను స్తంభింపజేయటమే ప్రతిపక్షానికున్న ఆయుధమని రాజ్యసభలో ప్రతిపక్ష నేత వెంకయ్య నాయుడు ఆనాటి ఘటనను సమర్థించుకున్నారు. అదే వెంకయ్యనాయుడు రాజ్యసభ చైర్మన్ హోదాలో.. సభలో సభ్యులు హుందాగా ఉండాలి గానీ, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించటం సహేతుకం కాదని హితవు పలికారు. ఏటికి ఆవలి ఒడ్డున ఒక మాట, ఈవలి ఒడ్డున మరొక మాట చెప్పటం మన నేతలకు పరిపాటిగా మారింది. నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం గందరగోళం సృష్టించిన ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయలేదు. సభ్యులను సస్పెండ్ చేసి సభను నిర్వహించాలనుకోలేదు. కానీ, నేటి పాలకపక్షం.. ప్రతిపక్షాల గొంతు నొక్కింది. ఇదేమి ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఇదేమి పార్లమెంటరీ సంస్కృతి! అనేది అర్థం కావటం లేదు. అందుల్లనే ఈ సంవత్సరానికి గందరగోళంతో వీడ్కోలు పలుకుతున్నామని అనిపిస్తున్నది.

నూతన సంవత్సరంలో నూతన ప్రభుత్వం ఏర్పడబోతున్నది. అప్పుడైనా పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగాలని, కొత్త సంవత్సరంలో అయినా దేశానికి మంచి జరగాలని ఆశిద్దాం. ప్రజలు ఓటు వేశాక ఆశించటం తప్ప చేసేదేముంటుంది. ఆశపడటానికి ఖర్చు ఏమీ ఉండదు కదా!

ప్రతిపక్ష సభ్యులు పట్టువిడుపు చూపాలి. పార్లమెంట్‌పై దాడి జరగటం దురదృష్టకరం. దానిపై దర్యాప్తు జరుగుతుండగానే, ఆ దర్యాప్తు ఓ కొలిక్కి రాకముందే ప్రభుత్వం ఏమని ప్రకటన చేయాలి? ప్రతిపక్షాల పంతం అర్థరహితం. సస్పెండ్ అయ్యి వాళ్లు సాధించిందేమిటి? సభలో ప్రతిపక్షం లేకుండానే కీలక బిల్లులు ఆమోదం పొందాయి. ప్రతిపక్షం నిరసనతో దేశానికి వచ్చిన ప్రయోజనం ఏంటి? సభలో ఉండి వాళ్ల వాణి వినిపించాలి గానీ, సస్పెండ్ అయ్యి బయట ధర్నా చేస్తే ఒరిగేదేముంది? సభలో గందరగోళం సృష్టించాలని ప్రజలు కోరుకోవటం లేదు. తెగేదాకా లాగమనీ ప్రజలు కోరడం లేదు. మరి ఎవరి ప్రయోజనం కోసం ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి? ఇది సమాధానం లేని ప్రశ్న. బహుశా ఇదేనేమో రాజకీయం అంటే!

# అప్పులపై అభాండాలా?

**ఒక్కడే నాయకుడు.. నాలుగు కోట్ల జనాభా. పోరాడి సాధించుకున్న తెలంగాణ. దేశానికే ఆదర్శమైన ఆలోచనలు- పథకాలు. అంతర్జాతీయ ప్రామాణిక సంస్థల ప్రశంసలు. ఉద్యమ నాయకుడికి క్షీరాభిషేకాలు. దేశ ప్రధాని సైతం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కొనియాడారు. మరి ఇప్పుడు కాలికి బలపం కట్టుకొని అనేక అసత్యాలను ప్రచారం చేసి ఎట్టకేలకు అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ వెంటనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, గవర్నర్‌తో అసత్యాలు చెప్పించడం, అప్పులు ఆరు లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయంటూ సమావేశాలు- సమీక్షలు నిర్వహించడం, గత ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే కదా! ప్రజానీకాన్ని, మేధావులను తప్పుదోవ పట్టించడానికే కదా!**



**పొందూరు ప్రభాకర్ రావు**
90106 31727



ఓటర్లు పిచ్చోళ్లని, వాళ్లకు నిజాలు చెప్పినా నమ్మరని, అబద్ధాలే తీయగా ఉంటాయని, వాళ్లు ఏది అడిగితే అది ఇస్తామని, మళ్లీ వాళ్ల జేబులే కొడతామని విస్పష్టంగా పదేండ్ల కిందటే ప్రస్తుత సభా నాయకుడు ఓ వేదిక ద్వారా చెప్పారు. మరి ఇప్పుడు అప్పులపై నానా యాగీ చేయడమెందుకు? కొన్ని అంశాలను సీబీఐకి అప్పగిస్తామని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని పదేపదే చెప్పడం హర్షించదగ్గ విషయమే. 1991లో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ కాదా? అప్పులు పెరిగిపోయి.. అప్పులే పుట్టని స్థితిలో ఐఎంఎఫ్ నుంచి అప్పు తెచ్చింది కాంగ్రెస్ కాదా? భారత ఆర్థిక వ్యవస్థను ప్రైవేటీకరణ చేసింది కాంగ్రెస్ కాదా? ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆనాటి ప్రతిపక్షాలు నిరసన తెలిపింది నిజం కాదా? నూతన ఆర్థిక విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విలీనం చేయవచ్చని అప్పట్లో చెప్పిందెవరు? దారిద్ర్యం నిర్మూలన వైపుగా అభివృద్ధిని వేగవంతం చేయవచ్చని చెప్పింది కాంగ్రెస్ కాదా? పెరిగిపోతున్న కార్మిక శక్తికి విస్తృతస్థాయిలో ఉద్యోగాలు కల్పించవచ్చని, ప్రపంచ మార్కెట్లో పోటీని తట్టుకోగల రీతిలో ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి కల్పించగల ఉత్పత్తి వ్యవస్థను రూపొందించవచ్చని చెప్పింది కాంగ్రెస్ కాదా? నాడు ప్రతిపక్షాలు మొత్తుకుంటుంటే.. అప్పులు ఆస్తులను సృష్టిస్తాయని, ఉద్యోగాలు కల్పిస్తాయని, దారిద్ర్యం పోతుందని చెప్పింది కాంగ్రెస్ కాదా?

1991 -2009 మధ్యకాలాన్ని ఒకసారి పరికిస్తే.. ఈ నూతన ఆర్థిక విధానాల లక్ష్యాలు నెరవేరకపోగా ఆకాశాన్నంటే ధరలు ఒకవైపు, అంతులేని నిరుద్యోగం మరోవైపు పెరిగిపోవడాన్ని చూసి అవినీతి, బంధుప్రీతి- చీకటి బజారి అన్న శ్రీశ్రీ పాట గుర్తుకొస్తున్నది. 2జీ కుంభకోణం, ఆదర్శ హౌసింగ్ సొసైటీ, కామన్వెల్త్ తదితర కుంభకోణాలు ఆనాటి కాంగ్రెస్ పాలకుల పుణ్యమే కదా! ఆనాటి కుంభకోణాల పాలనే నేడు కాంగ్రెస్ చెప్తున్న ప్రజా పాలన. బాజాప్తాగా తమపై న్యాయ విచారణ చేయాలని బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడమే ప్రజాపాలనకు సూచిక. ఒకవేళ తప్పు చేస్తే శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉన్నామని బహిరంగంగా ప్రకటించడమే అసలైన ప్రజాపాలన.

ఈ దేశంలో భూ సంస్కరణ వైఫల్యానికి ప్రధాన కారణం కాంగ్రెస్ కాదా? వామపక్ష భావజాలాన్ని లేకుండా చేసింది కాంగ్రెస్ కాదా? ఇది గత ప్రభుత్వాన్ని సమర్థించడం కాదు. ప్రపంచంలో ఏం జరుగుతుందో ప్రజలకు ప్రజాప్రతినిధులకు తెలియజేయటం. ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలైన శాసన, కార్య నిర్వాహక, న్యాయ, మీడియా తలుచుకుంటే, త్యాగనిరతి ఉంటే దారిద్ర్యం పోదా? వట్టి మాటలు కట్టిపెట్టవోయి- గట్టి మేలు తలపెట్టవోయి! అన్న గురజాడ అప్పారావు మనోవాంఛను నెరవేర్చండి.

అప్పుల గురించి కొంత సూత్రబద్ధంగా చెప్పాలి. వర్ధమాన దేశాలను అభివృద్ధి పథంలో తీసుకురావాలంటే లోటు బడ్జెట్ విధానాన్ని అనుసరించాలని జేఎం కీన్స్ అనే ఆర్థికవేత్త సూచించారు. ఈ లోటును పూడ్చటానికి వివిధ మార్గాలు ఉన్నప్పటికీ అప్పులే ప్రధాన మార్గాలుగా ప్రభుత్వాలు ఎంచుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ర్టాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ లోటు బడ్జెట్ విధానాన్ని ఎంచుకున్నది. మార్కెట్ అప్పులు, ఆర్థిక సంస్థల నుంచి అప్పులు, కేంద్ర ప్రభుత్వ అప్పులు, ప్రభుత్వ సెక్యూరిటీలను బ్యాంకుల ద్వారా అమ్మకం తదితర మార్గాల్లో లోటును పూడ్చుకుంటూ తెలంగాణ అభివృద్ధి పథంలో పయనించింది. ఈ సెక్యూరిటీల మెచ్యూరిటీ కాలాన్ని 10 ఏండ్ల నుంచి 20 ఏండ్లకు పెంచినా మార్కెట్లో విశేష స్పందన లభించింది. అప్పులు పెరిగిన మాట వాస్తవమే. కానీ, మిగతా రాష్ర్టాలతో పోలిస్తే అప్పుల విషయంలో 28 రాష్ర్టాల జాబితాలో మన తెలంగాణ చివరి నుంచి ఐదో స్థానంలో ఉన్నది. దేశ జీడీపీలో అప్పుల నిష్పత్తి 27.3 శాతం ఉండగా మన రాష్ట్ర అప్పుల నిష్పత్తి 21 శాతమే. అంతర్జాతీయంగా చూసుకుంటే.. ఈ నిష్పత్తి జపాన్‌లో 230 శాతం, గ్రీస్‌లో 182 శాతం, పోర్చుగల్‌లో 120 శాతం, అమెరికాలో 107 శాతం, సింగపూర్‌లో 110 శాతంగా ఉన్నది. కేంద్రం అప్పులు 156 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**తెలంగాణ విషయానికి వస్తే అప్పులతో సంపద సృష్టి జరిగింది. అప్పులు తెచ్చి గత ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక ప్రాజెక్టులు నిర్మించింది. పారిశ్రామిక రంగ అభివృద్ధికి కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చింది. మరోవైపు సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర తలసరి ఆదాయం, దేశ తలసరి ఆదాయాన్ని మించిపోయింది. అనేక రాష్ర్టాలు మన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయి.**

రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. రైతు రాజయ్యాడు. పారిశ్రామిక, సేవా రంగాలు వృద్ధి చెందాయి. అన్నింటి మూలంగా పదేండ్లలో తెలంగాణలో ప్రజల కొనుగోలు శక్తి 41 శాతం పెరిగినట్టు అనేక అధ్యయనాలు చెప్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల వరకు ఉద్యోగాలు కొత్తగా పుట్టుకొచ్చాయి. గత ప్రభుత్వం అప్పులు చేసిందని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ సైతం అప్పులు చేయకుండా ప్రభుత్వాన్ని ఎవరూ నడపలేరని అంగీకరిస్తున్నది. అందుకే ప్రజానీకం, మేధావులు అప్పులకు సంబంధించిన సిద్ధాంతాలు, సూత్రాలను పరిశీలించి శాస్త్రీయతను భవిష్యత్తులోనైనా గమనించాలి.




## గులేరు అందుకున్న...

గులేరు
యాదికున్నద
చిన్నతనంల
మన పోరగాళ్ల
అతారె

సూటి పెట్టి
ఏదో కొట్టబోయి
ఏదో కొట్టెటోళ్లం
సంబురం సంబురం
ఓనగాయె గుండెల్ల

కళ్లు పెద్దగయినై
కాళ్లు పెద్దగయినై

బతుకు పటం నిండ
గాయాల గేయాలు
గేయాల గాయాలు
ఇంకెన్ని దినంలు
సైకో చాక్లెట్లు తినిపిస్తరు
నా తమ్ముళ్లకు చెల్లెల్లకు
సూటి తెలిసింది
గులేరు అందుకున్న...



డాక్టర్
సదానంద్ శారద

## ప్రజలను విడగొట్టడమే బీజేపీ విధానం!

*పౌరసత్వం ఎవరికి ఇవ్వాలనేది గతంలో జిల్లా మేజిస్ట్రేట్ నిర్ణయించేవారు. ఆ నిబంధనను రాజకీయ అవసరాల కోసం కావాలనే తొలగించారు. ప్రజలను విడగొట్టడమే బీజేపీ విధానం. పౌరసత్వాన్ని ఒక వర్గానికి ఇచ్చి, మరో వర్గానికి తిరస్కరించాలనేది వారి పన్నాగం. ఒకరికి ఇచ్చినప్పుడు, మరొకరికి కూడా ఇవ్వాలి కదా! ఇలా వివక్ష చూపడం తప్పు.*

**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి



